క్లుప్తంగా

'మా ప్రయాణం ఎమ్మెల్యే శిల్పా వెంటే'



వైఎస్సార్‌సీపీలోనే ఉన్నామని చెబుతున్న మైనారిటీ యువకులు

శ్రీశైలంప్రాజెక్ట్: మా ఇంటి దగ్గర స్నేహితులతో కలిసి మాట్లాడుతుండగా టీడీపీ నాయకులు యుగంధర్‌రెడ్డి ప్రచారం చేసుకుంటూ మా దగ్గరకు వచ్చి ఫొటో తీయించుకున్నాడు. మేం జోయల్‌గా తీసుకున్నాం, మేం టీడీపీలో చేరినట్లు సోషల్‌మీడియాలో వారు ప్రచారం చేశారు. తాము ఇప్పటికీ, ఎప్పటికీ వైఎస్సార్ సీపీలోనే ఉంటామని, మా ప్రయాణం ఎమ్మెల్యే శిల్పన్న వెంటేనని రఫీ, జాఫర్, షఫీ, ఆరిఫ్, షాహిద్‌లు శనివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులకు తెలిపారు. సేవా తత్పరుడు శిల్పా చక్రపాణిరెడ్డి గెలుపుకు కృషి చేస్తామన్నారు.

ముచ్చుమర్రిలో టీడీపీ రోడ్‌షోకు జనం కరువు



జనం లేక వెలవెలబోయిన టీడీపీ రోడ్ షో

పగిడ్యాల: సార్వత్రిక ఎన్నికల ప్రచారం ముగింపు చివరి రోజైన శనివారం నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి సొంతూరు మండలంలోని పాత, కొత్త ముచ్చుమర్రి గ్రామాల్లో టీడీపీ చేపట్టిన రోడ్‌షోకు జనం కరువయ్యారు. స్థానికుల నుంచి పెద్దగా స్పందన లేక రోడ్ షో మొక్కుబడిగా సాగింది. రోడ్ షోలో నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి గిత్త జయసూర్యలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకోవడంతో స్థానికుల నుంచి వ్యతిరేకత ఎదురైంది. జగనన్నను, బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని విమర్శిస్తే సహించేది లేదని, రోడ్ షో ముగించుకుని వెళ్లాలని ప్రతిఘటించారు. అప్రమత్తమైన పోలీసులు స్పందించి సమస్య ఉద్రిక్తతకు దారి తీయక ముందే స్థానికులకు నచ్చజెప్పారు. రోడ్ షోలో ఎక్కువగా బందోబస్తు పోలీసులు, వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన వాహనాలే కనిపించడం విశేషం. ఎమ్మెల్యే అభ్యర్థి వెంట నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి రోడ్ షోలో పాల్గనకపోవడం గమనార్హం.

పోలింగ్ కేంద్రాల వద్ద వీల్‌చైర్లు

మహానంది: బండిఆత్మకూరు మండలంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద వీల్‌చైర్లు అందుబాటులో ఉంచుతున్నట్లు ఎంపీడీఓ విజయరావు తెలిపారు. శనివారం బండిఆత్మకూరులోని ఎంపీడీఓ కార్యాలయానికి 25 వీల్‌చైర్లు వచ్చినట్లు చెప్పారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ఒకటి ఉంటుందని, దివ్యాంగుల సౌకర్యార్థం వినియోగిస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమక్షంలో 9వ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు భారీగా వార్డు కౌన్సిలర్ సుల్తాన్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే శిల్పా వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

పోలింగ్‌కు సర్వ సిద్ధం

నందికొట్కూరు: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఎన్నికల నిర్వహణ, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది.

251 పోలింగ్ కేంద్రాలు


నియోజవర్గ వ్యాప్తంగా 2,18, 047 లక్షల మంది ఓటర్లు ఉండగా 251 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో పురుషులు-1,07,008, మహిళలు-1,11,344, ఇతరులు-18 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ సిబ్బంది 1,899 మందిని నియమించారు. 25 రూట్‌లు ఉండగా సిబ్బందిని తరలించేందుకు 82 వాహనాలు (బస్సులు 54, జీపులు 28) ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నీచర్, హెల్ప్‌డెస్క్, తదితర సౌకర్యాలు కల్పించారు. ఎన్నికల సామగ్రి, వీవీప్యాట్, ఈవీఎంలు, పోలింగ్ సిబ్బందిని తరలించేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా వాహనాలు సిద్ధం చేశారు. నియోజకవర్గంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ముచ్చుమర్రితో పాటు 36 ఉన్నాయి.

దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియోజకవర్గంలో దివ్యాంగుల పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు, ట్రై సైకిళ్లు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో దివ్యాంగులు, మూగ చెవిటి-3,120 మంది ఓటర్లు ఉండగా వీరు ఓటు హక్కు ను వినియోగించుకునేందుకు వాహనాలు ఏర్పాటు చేశారు. 85 ఏళ్ల పైబడిన ఓట్లు-1,121 ఉన్నాయి. మోడల్ పోలింగ్ స్టేషన్ల ను పట్టణంలోని నంది కళాశాలలో పీఎస్-49-75ను ఎంపిక చేశారు.

అభివృద్ధి పరుగు.. సౌకర్యాలు మెరుగు

- వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రేడ్-2 మున్సిపాలిటీగా నందికొట్కూరు
- రూ. 50.68 కోట్లతో పట్టణంలో 351 అభివృద్ధి పనులు
- సీసీ రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యంపై దృష్టి
- వీధివీధినా సీసీ రోడ్లు, డ్రైనేజీలు



పట్టణ సమీపంలోని జగనన్న కాలనీ



సంగయ్యపేటలోని ఓ వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైనేజీ



ఏబీఎం పాలెంలో ప్రారంభించిన కుడా పార్కు



నిర్మాణంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు

నందికొట్కూరు: రోజురోజుకు విస్తరిస్తున్న పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మెరుగైన సౌకర్యాలు కల్పిస్తోంది. ఈ మేరకు పట్టణంలో అభివృద్ధి పనులను చేపట్టింది. నందికొట్కూరు గ్రేడ్-2 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు ప్రత్యేక నిధులను కేటాయించడంతో పట్టణంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది.

2020లో గ్రేడ్-2 మున్సిపాలిటీగా..

ప్రస్తుతం పట్టణం 23.85 చదరపు కిలో మీటర్లు విస్తరించి ఉంది. పట్టణంలో ఎన్నికల వార్డులు-29, రెవెన్యూ వార్డులు-16 ఉన్నాయి. ఓట్లు మొత్తం -33, 817 ఉన్నాయి. జనాభా సుమారు 65 వేలు. గ్రేడ్-3గా ఉన్న నందికొట్కూరు మున్సిపాలిటీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక 2020 సెప్టెంబర్‌లో గ్రేడ్-2కు మారింది.

నందికొట్కూరు మున్సిపాలిటీకి నిధుల వరద..

నందికొట్కూరు పట్టణానికి నందనవనంగా తీర్చిదిద్దాలని సంకల్పంతోనే 351 వర్కులకు గాను 50.68 కోట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. దీనికి తోడు గడప గడపకు మన ప్రభుత్వం నిధుల కింద రూ, 2.80 కోట్లతో 51 వర్కులు, ప్రత్యేక నిధులతో 115 వర్కులకు రూ.15.34 కోట్లు మంజూరయ్యాయి. అంతేకాకుండా మున్సిపాలిటీ నూతన భవన నిర్మాణానికి రూ.3. 24 కోట్లు, ఏబీఎం పాలెంలో కుడా పరిధిలో జైభీమ్ పార్కు నిర్మాణానికి రూ.40 లక్షలు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు అయ్యాయి. అంతేకాకుండా క్రీడలను ప్రోత్సహించేందుకు రూ.50 లక్షలతో ఇండోర్ స్టేడియం నిర్మించారు. 14వ ఆర్థిక, 15వ ఆర్థిక నిధులు, జనరల్ ఫండ్ కలిపి రూ.29.10 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేశారు. రూ.20 లక్షలతో ముస్లిం శ్మశాన వాటికకు కాంపౌండ్ వాల్ నిర్మాణం పూర్తయింది. అలాగే ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆత్మకూరు రోడ్డులోని షాదీఖానా నిర్మాణానికి రూ.1.32 కోట్లు మంజూరు చేసి పనులను ప్రారంభించారు. పట్టణంలో రూ. 4 కోట్లతో 30 పడకల నూతన సామాజిక ఆరోగ్య కేంద్ర నిర్మాణం పూర్తి చేసి రోగులకు అన్ని రకాల వైద్య చికిత్సలు అందిస్తున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.10 లక్షలతో నూతన పైపులైన్‌తోపాటు పాత పైపుల మార్పు పనులు చేపట్టారు. అలాగే రూ.130 కోట్ల జల్‌జీవన్ నిధులతో పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు నూతన పైప్‌లైన్ నిర్మాణం, 3 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పట్టణంలోని కర్నూలు రోడ్డు బైరెడ్డి నగర్‌లో, షికారి పేట, తహసీల్దార్ కార్యాలయం వద్ద నూతన ట్యాంకుల నిర్మాణం చేప్టటారు.

అభివృద్ధి చేసి చూపారు



పట్టణం అభివృద్ధి జరిగింది. రూ.1.32 కోట్లతో షాదీఖానా, ఏబీఎం పాలెంలో కుడా నిధులు రూ.40 లక్షలతో పార్కు నిర్మాణం, రూ.50 లక్షలతో ఇండోర్ స్టేడియం, ముస్లిం శ్మశాన వాటికకు రూ, 20 లక్షలు వెచ్చించి నిర్మాణాలు పూర్తి చేసి చూపారు. మున్సిపాలిటి నూతన భవనం రూ. 2.32 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగింది.

– షేక్ అబ్దుల్లా , నందికొట్కూరు

వైఎస్ జగన్ పాలనలో పట్టణం అభివృద్ధి



సచివాలయ వ్యవస్థను దేశంలో తెచ్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్ ఒక్కరే. పట్టణంతో పాటు శివారు ప్రాంతంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు పూర్తి చేశారు. 40 ఏళ్ల నుంచి ఏ రాజకీయ నాయకుడు పట్టించుకోలేదు పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రూ.16 కోట్లతో పట్టణంలో అభివృద్ధి జరిగింది. మంచినీటి సమస్య తెలెత్తిన వెంటనే స్పందించి పరిష్కారం చూపారు. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు ఒక పైసా లంచం లేకుండా అందజేసిన ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం.

– వెంకటేశ్వర్లు, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు

సొంతింటి కల నెరవేరింది



గతంలో 10 ఏళ్ల పాటు అద్దె ఇంట్లో ఉండేవాళ్లం. నెల వచ్చే సరికి బాడుగ చెల్లించాలనే భయం ఎక్కువ ఉండేది. వైఎస్సార ప్రభుత్వం స్థలంతో పాటు పక్కా గృహం మంజూరు చేసింది. అలాగే ప్రభుత్వం రూ.1. 80 లక్షలు ఇస్తే మిగత సొంతంగా పైసలు పెట్టి ఇంటి నిర్మాణం పూర్తి చేస్తున్నాం. సొంతింటి కల సీఎం వైఎస్ జగనన్నతో సాకారం అయింది. విద్యుత్ మీటరు కూడా ఉచితంగా మా ఇంటికి అమర్చారు. సీఎం జగనన్నకు జీవితాంతం రుణ పడి ఉంటాం. నాగలక్ష్మి, నందికొట్కూరు

జిల్లాలోనే అతిపెద్ద జగనన్న కాలనీ

మున్సిపాలిటీ పరిధిలో కొణిదేల రోడ్డుకు మున్సిపల్ రెవెన్యూ పరిధిలో నాలుగు లే అవుట్లలో సుమారు 60 ఎకరాల్లో జగనన్న కాలనీ నిర్మించారు. 1,850 గృహ నిర్మాణాలు పూర్తి చేయడం జరిగింది. నిర్మాణాలు పూర్తయిన లబ్ధిదారులందరూ గృహ ప్రవేశాలు సైతం చేసుకున్నారు.

జగనన్నతోనే రాష్ట్రం సుభిక్షం



అల్లూరులో మండల నాయకులను కలిసిన ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డి

నందికొట్కూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని నంద్యాల వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చెంచిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డిలను కలిశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలంటే సీఎంగా జగనన్నను గెలిపించుకోవాలని అన్నారు. ఈనెల 13న జరగబోయే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా దారా సుధీర్‌ను, ఎంపీగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, గ్రామ నాయకులు రవీంద్రనాయుడు, పాపన్న. శేషన్న, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో ఎంపీ పోచా పూజలు

మహానంది : మహానందీశ్వరుడి సన్నిధిలో నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి శనివారం పూజలు నిర్వహించారు. శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు. తమ్మడపల్లె వద్ద జడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మ మహేశ్వరరెడ్డి, గ్రామస్తులు మర్యాద పూర్వకంగా కలిశారు.

ప్రజలకు సేవచేసే గుణం బుడ్డాకు లేదు



మాట్లాడుతున్న అహ్మద్‌హుస్సేన్

శ్రీశైలంప్రాజెక్ట్: రాజకీయ నాయకుడికి ప్రజలకు సేవచేసే గుణం ఉండాలని, ఆ లక్షణాలు లేని బుడ్డా రాజశేఖరరెడ్డికి లేవని, ఆయన రాజకియాలకు పనికిరాడని మాజీ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ అహ్మద్‌హుస్సేన్ అన్నారు. శనివారం మధ్యాహ్నం సున్నిపెంటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బుడ్డా రాజశేఖరరెడ్డి గాడ్‌ఫాదర్‌లను నమ్ముకొని రాజకీయాలు చేస్తున్నాడని, ప్రజల ఆశీస్సులను ఆయన నమ్ముకోవడం లేదన్నారు. అంతు చూస్తా అంటూ బెదిరింపు రాజకీయాలు చేస్తున్నాడని.. అటువంటి నాయకుడికి ఓటు వేస్తే మన జీవితాలు నాశనమవుతాయన్నారు. ఈ ఎన్నికల్లో ఏరాసు ప్రతాపరెడ్డి శ్రీశైలం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిని తానేనంటూ ఫ్లెక్సీలు వేసుకుంటే రాజశేఖరరెడ్డి కొడవళ్లతో వాటిని చింపించి, ఏరాసును భయపెట్టారన్నారు. గతంలో, ఇప్పుడు ఎన్ని అవమానాలు చేస్తున్నా సిగ్గులేకుండా ఏరాసు బుడ్డాకు ప్రచారం చేస్తున్నారన్నారు.

మతాల మధ్య చిచ్చుపెట్టే బీజేపీతో టీడీపీ పొత్తు

సెక్యూలర్ దేశంగా ఉన్న భారతదేశంలో మతాల మధ్య చిచ్చుపెట్టి, మైనారిటీల రిజర్వేషన్లను ఎత్తివేసే దిశగా ప్రధాని నరేంద్రమోదీ ముందుకు పోతున్నాడని, అటువంటి మతతత్వపార్టీ బీజేపీతో తెలుగుదేశం అధినేత పొత్తుపెట్టుకోవడం సిగ్గుచేటన్నారు. ముస్లిం మైనార్టీలు తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమిని కూలదోయాలని పిలుపునిచ్చారు. 40 సంవత్సరాలుగా టీడీపీలో కొనసాగానని, ఆ పార్టీ మతతత్వ బీజేపీతో పొత్తుపెట్టుకోవడం వలన ముస్లిం మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని భావించి పార్టీకి రాజీనామా చేశానని చెప్పారు. నిరంతరం ప్రజాసేవకు అంకితమైన శిల్పా చక్రపాణిరెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. సమావేశంలో మైనారిటీ నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ నూర్‌అహ్మద్, మాజీ ఈఓ ఖమ్రుద్దీన్, మాజీ మున్సిపల్ కో-ఆప్షన్‌మెంబర్ జాకీర్‌హుస్సేన్, జుటూరి మహమ్మద్ ఖాసీం, గౌస్, గఫార్, హిదాయతుల్లా, గౌస్‌మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్నికల ప్రచారం

- వైఎస్సార్‌సీపీ ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన
- టీడీపీ సభలకు జనం కరువు



సున్నిపెంట వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రంలో ముగిసింది. గత 12 రోజులుగా ప్రధాన పార్టీలైన వైఎస్సార్‌సీపీ, టీడీపీ, కాంగ్రెస్, బీఎస్పీ, ఇండిపెండెంట్ అభ్యర్థులు సైతం ఎన్నికల ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం జనసంద్రం మధ్య కొనసాగింది. ప్రతి మండలంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి వేలాది మంది ప్రజలు ఎన్నికల ప్రచారానికి తరలివచ్చారు. ఏ గ్రామంలో చూసినా ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగింది. ప్రధాన ప్రత్యర్థి అయిన టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నామమాత్రంగా కొనసాగింది. జనాలు రాకపోవడంతో టీడీపీ అభ్యర్థులు ప్రచారం త్వరితగతిన పూర్తి చేసుకుని వెళ్లాల్సి వచ్చింది. శనివారం మండలంలోని అమలాపురం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు మోమిన్, ముస్తఫా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుపాలు, రామన్న, మజీద్, అఫీ, గ్రామప్రజలు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని 6వ వార్డులో ఇన్‌చార్జి అహమ్మద్ రసూల్ ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్, కో ఆప్షన్ సభ్యుడు రషీద్, అహమ్మద్‌హుసేన్, నూర్‌మహమ్మద్ పాల్గొన్నారు.

సున్నిపెంటలో భారీ ర్యాలీ

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం కదం తొక్కారు. సున్నిపెంట వీదుల్లో శిల్పా చక్రపాణిరెడ్డి సోదరి తిలోత్తమరెడ్డి ఆధ్వర్యంలో భారీగా ర్యాలీ, ప్రచారం నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్, అక్కమ్మ సెంటర్, పూర్ణానంద ఆశ్రమం, చాపల మార్కెట్, బండ్లబజార్, రామాలయం, వెస్టన్ కాలనీ వరకు సాగింది. తిలోత్తమరెడ్డి మాట్లాడుతూ మా అన్న చక్రపాణిరెడ్డి శ్రీశైలం నియోజక వర్గంలో సేవలు ఎన్నో చేశారని, అటువంటి నాయకుడిని మళ్లీ ఎన్నికల్లో గెలిపించుకుంటే మరింత సేవ చేసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టి వెంకటరెడ్డి, అంబేడ్కర్ ఇండియా మిషన్ రాయలసీమ ఇన్‌చార్జ్ జి.శోభన్‌బాబు, పార్టీ నాయకులు భరత్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, పాపారావు, బూదాల దానియేల్, ముస్తఫా, బక్కన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో వైఎస్సార్‌సీపీ విస్తృత ప్రచారం

శ్రీశైలం : క్షేత్ర పరిధిలో శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృత ప్రచారం చేపట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీ, శ్రీగిరి కాలనీలతో పాటు శ్రీశైలంలో ఉన్న అన్ని దుకాణాల వద్దకు వెళ్లి ఫ్యానుగుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పాచక్రపాణి రెడ్డికి ఓటు వేసి గెలిపించాల్సిందిగా వైఎస్సార్‌సీపీ నాయకులు అభ్యర్థించారు.



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా సోదరి తిలోత్తమరెడ్డి



అమలాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం



6వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న అహమ్మద్ రసూల్



తమ్మడపల్లెలో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మహానంది: మండల పరిధిలోని తమ్మడపల్లెలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మ పాల మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి ఎన్నికల ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మహానంది ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ కొమ్మా ప్రతాప్‌రెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శివయ్య, నాగేశ్వరరెడ్డి, నాగమల్లేశ్వర రెడ్డి, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి..ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- ఆత్మకూరు, వెలుగోడులో ఆర్యవైశ్యులతో ఆత్మీయ సమావేశం



ఆత్మకూరులో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని సన్మానిస్తున్న ఆర్యవైశ్య మహిళలు

ఆత్మకూరు: ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని.. ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని తోటగేరిలో శనివారం ఆర్యవైశ్యులతో ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సంక్షేమానికి పూర్తిగా సహకరిస్తానని చెప్పారు. అమ్మవారిశాలకు చెందిన పొలం నేషనల్ హైవేలో పోయిందని, సాంకేతిక కారణాలతో అమ్మవారిశాలకు చెందిన అకౌంట్‌లో పరిహారం జమ కాకపోతే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి రూ.80 లక్షలు మంజూరు చేయించాని గుర్తు చేశారు. ఈ మొత్తం నగదు అమ్మవారిశాల అధ్యక్షుడి ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. అలాగే ఆత్మకూరు పట్టణంలో ఆర్యవైశ్యులకు మున్సిపల్ వైస్ చైర్మన్ పదవితో పాటు సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఎందరికో సహాయ సహకారాలు అందించడం జరిగిందన్నారు. ఆర్యవైశ్యులు తనను భారీ మెజార్టీతో ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో ఆర్యవైశ్యుల సంఘం నాయకులు పువ్వాడ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతకముందు ఆర్యవైశ్య మహిళలు, సభ్యులు కలిసి ఎమ్మెల్యేను దుశ్శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు జక్కామురళి, భీమిశెట్టి , నరేష్, గూడూరు సుబ్బారాయుడు, వొడాఫోన్ సత్యం, రామచంద్రయ్యశెట్టి, భీమిశెట్టి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఎవరికీ భయపడొద్దు..

వెలుగోడు: ఎన్నికల సమయంలో ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని, ఆర్యవైశ్యులకు అండగా ఉంటానని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి భరోసా ఇచ్చారు. స్థానిక వాసవీ కళ్యాణ మండపంలో శనివారం వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు బళ్లాని వెంకటసత్యనారాయణ అధ్యక్షతన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సమావేశానికి శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..30 ఏళ్లుగా ఆర్యవైశ్యులతో సోదరాభావంతో మెలుగుతున్నామని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఓటమి భయంతో తిట్ల దండకం మొదలుపెట్టారన్నారు. కండువాలు కప్పినంత మాత్రానా ఓట్లు వేయరని, హృదయంలో ఉన్న వారికే ఓట్లు వేస్తారన్నది మరచిపోకూడదన్నారు. స్థానిక వెంకటేశ్వరస్వామి దేవాలయానికి రూ.25 లక్షల ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. నియోజకవర్గంలో ఎన్నో కార్యక్రమాలకు తన సొంత నిధులు ఖర్చు చేశానని తెలిపారు. శ్రీశైలం దేవస్థానాన్ని తిరుమల తరహా అభివద్ధి చేస్తామని చెప్పారు. శ్రీశైల దేవస్థానానికి 5300 ఎకరాలు సర్వే చేయించి రాళ్లు పాతించినట్లు వెల్లడించారు. బీజేపీకి ఓటు వేస్తే టీడీపీకి వేసినట్లే అని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

టీడీపీ ప్రలోభాల పర్వం !

జూపాడుబంగ్లా: శనివారం సాయంత్రానికి ఎన్నికల ప్రచారహోరు ముగియటంతో టీడీపీ నాయకులు ప్రలోభాల పర్వానికి తెరలేపారు. అందులో భాగంగా నందికొట్కూరు నియోజకవర్గంలోని 77 గ్రామపంచాయతీల్లోని 2,16,560 మంది ఓటర్లలో 80శాతం మేర అంటే 1,73,248 మంది ఓటర్లకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున రూ.17.32కోట్ల డబ్బులను గ్రామాల్లోని ఓ వర్గం నాయకుల చేతుల్లో పెట్టినట్లు టీడీపీ నాయకులు చర్చించుకుంటున్నారు. అయితే డబ్బుల పంపిణీ పెత్తనం ఓ వర్గానికి మాత్రమే కట్టబెట్టడంతో రెండోవర్గం నాయకులు టీడీపీ అధిష్టానంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. తమపై నమ్మకం లేనప్పుడు మేమెందుకు పార్టీలో కొనసాగాలంటూ ప్రశ్నిస్తున్నారు.

జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకుందాం



తూడిచెర్లలో ప్రచారం చేస్తున్న దారా సుధీర్ సతీమణి డాక్టర్ శ్రీలతారెడ్డి



పైపాలంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం



తుమ్మలూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రామలింగేశ్వరరెడ్డి



కొత్త ముచ్చుమర్రిలో ర్యాలీగా వస్తున్న బైరెడ్డి శివారెడ్డి

జూపాడుబంగ్లా: మహిళలు, రైతులు అభివృద్ధి పథంలో నడవాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దారాసుధీర్ సతీమణి డాక్టర్ శ్రీలతారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని తూడిచెర్ల గ్రామంలో ఎంపీటీసీ దొడ్డా నాగమణి, ఉపసర్పంచ్ చెన్నారెడ్డి, దొడ్డాసుధాకర్, కోట్లగోపాల్ అధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దొంతుల నరసింహులు యాదవ్, మధుకృష్ణ, వెంకటనాయుడు, రవికుమార్, దొంతుల నడిపెన్న, సోమశేఖర్, శ్రీనివాసగౌడు పాల్గొన్నారు.

మిడుతూరు: మండల పరిధిలోని పైపాలం గ్రామంలో శనివారం సర్పంచ్ రామచంద్రుడు, ఉపసర్పంచ్ రామకృష్ణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా డాక్టర్ దారా సుధీర్, నంద్యాల ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

పాములపాడు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

పగిడ్యాల: నందికొట్కూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్, నంద్యాల పార్లమెంట్ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ బైరెడ్డి మల్లికార్జునరెడ్డి, డాక్టర్ బైరెడ్డి ఉషారాణి, డాక్టర్ బైరెడ్డి శివారెడ్డి కొత్త ముచ్చుమర్రిలో ప్రచారం నిర్వహించారు. సర్పంచ్‌లు కాటం రాధమ్మ, పెద్ద ఆంజనేయులు, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, ఎంపీటీసీ కళావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మిడుతూరు: మండల కేంద్రమైన మిడుతూరుతో పాటు నాగలూటి, పైపాలం, మాసపేట, కడుమూరు, పీరుసాహెబ్ పేట తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను శనివారం ఎంపీడీఓ గంగావతి పరిశీలించారు. కేంద్రాలలో విద్యుత్ , నీటి సరఫరా, టాయ్‌లెట్స్ వసతులు, కేంద్రాల చుట్టూ పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.